శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



# ఉత్తమ పౌరులుగా బాధ్యతలు నిర్వహించండి కమిషనర్ సూర్యతేజ

### జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు




**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 24,ప్రభాతవార్త:** నేటి విద్యార్థులే రేపటి ఉత్తమ పౌరులుగా నిలిచి ప్రజాస్వామ్య పరిరక్షణలో బాధ్య తాయుతంగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆకాంక్షించారు. జాతీ య ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21 వ తేదీన 117 నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు మోడల్ స్కూల్ ప్రాంగణంలో క్విజ్, ఎస్సే రైటింగ్ , వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో కమిషనర్ శుక్రవారం శుభాకాంక్షలతో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను గురించి విద్యార్థులలో చైతన్యం కలిగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు పోటీలను నిర్వహించామని తెలిపారు. విజేతలుగా నిలిచిన 21 మంది విద్యార్థులతో కమిషనర్ మాట్లాడుతూ వారి భవిష్యత్ ఉన్నత ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు 5,4,3 వేల రూపాయల నగదు బహుమతులు, ప్రోత్సాహక పత్రాలను కమిషనర్ అందించి విద్యార్థులంతా పోటీ తత్వాన్ని అలవర్చుకొని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఆర్.ఓ. షఫి మాలిక్, యం.ఈ.ఓ.తిరుపాలు, ఈ.డి.టి.ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు, చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి24, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 1866 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 68.531టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎస్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2750, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.286 మీటర్ల మేర నీటిమట్టం నమోదైనది జలాశయం అధికారులు తెలిపారు.

# జిల్లాలో ప్రత్యేకంగా మద్యం షాపులు కేటాయింపు



**నెల్లూరు, జనవరి 24, ప్రభాత వార్త, కలెక్టరేట్** ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లు గీత కార్మికుల సంక్షేమార్ధం జిల్లాలో వారికి ప్రత్యేకంగా 18 మద్యం షాపులు కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లాకు మంజూరైన 18 షాపులకు కల్లు గీత కార్మికుల్లోని ఉప కులాలకు షాపులను లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఈ లాటరీలో గమళ్ల కులానికి 4, గౌండ్ల కులానికి 1, గౌడ కులానికి 7, గౌడ్ కులానికి 6 కేటాయించారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ సమితి నాయకుల పరిశీలనలో పూర్తి పారదర్శకంగా లాటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం వారికోసమే జిల్లాలో ప్రత్యేకంగా మద్యం షాపులు కేటాయించారన్నారు. ఆయా కులాలలోని ఉప కులాలకు లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించడం జరిగిందన్నారు. ఉప కులాలకు కేటాయించిన షాపుల వివరాలతో కూడిన నివేదిక ను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల ఏర్పాటు కొరకు ఆయా ఉపకులాలలోని ఔత్సాహికుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా షాపుల లైసెన్స్ ఫీజులో వారికి 50 శాతం రాయితీ కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, బిసి కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా నినాదాలతో దద్దరిల్లిన కొడవలూరు



**కొడవలూరు (విడవలూరు), జనవరి 24, ప్రభాతవార్త** రాబోయే ఎన్నికలలో టిడిపి ప్రభుత్వాన్ని గద్యదించి జగనన్నను ముఖ్య మంత్రిగా చేయడమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ధ్యేయమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా చేస్తూ నినాదాలతో ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా సర్పంచుల చెక్ పవర్ రద్దు చేయడం, వివో ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వహకులు, రేషన్ డీలర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలను తొలగించడం పై భుజం మెత్తారు. అదేవిధంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడతామని నీకు 15 వేలు, మీకు 18 వేలు, సంక్రాంతి కానుకన్నాడు అధికారంలోకి రాగానే ఆయనకు అవి ఏమి గుర్తు లేవన్నారు. అధికారులకు సోకాస్ నోటీస్ జారీ చేయకుండానే సస్పెండ్ చేయడం,చెక్ పవర్ ను రద్దు చేయడం ఇలాంటివి ఈ కూటమి ప్రభుత్వం చేస్తుందని సెటైర్లు వేశారు. అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, దొడ్ల నిరంజన్ బాబు రెడ్డి, అచ్యుత్ రెడ్డి,ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా కోవూరు



**ప్రశాంతి రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా వున్నారు**

**అవినీతిపరుల కొమ్ము కాస్తారా..?**

**మాజీ అయ్యాక ప్రసన్నకు మతి భ్రమించింది**

**నీ ఉడత ఊపులకు మేం భయపడం ప్రసన్నా**

**అధికారులను దుర్భాషలాడడం సంస్కారమా ప్రసన్నా**

**కొడవలూరు లో ప్రసన్న, కాకాణిలపై ధ్వజమెత్తిన కోవూరు టిడిపి నేతలు**

**కొడవలూరు (విడవలూరు), జనవరి 24, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఒకే అంటే మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి సైతం పచ్చ కండువా కప్పుకునేందుకు రెడీగా వున్నారన్నారు. టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి ఏ మాట్లాడాలో తెలియని కన్ఫ్యూజన్ లో కోవూరు నియోజకవర్గాన్ని ఉద్దేశించి అవినీతి రహిత అనబోయి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అనేశారన్నారు. మంత్రిగా వున్నప్పుడు నియోజకవర్గంలో అడుగు పెట్టనీయని ప్రసన్న తరుపున మాజీ మంత్రి కాకాణి వకాల్తా పుచ్చుకోవడం విడ్డూరంగా వుందన్నారు. దాదాపు 8 వేల మందికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు 100 మందికి పైగా దివ్యాంగులకు ఉచితంగా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు యిచ్చిన ప్రశాంతి రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం టిడిపి నాయకులు బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రసన్న పాలనలో అవినీతిలో టాప్ రేటింగ్లో వున్న కోవూరు నియోజకవర్గం వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక అవినీతి రహితంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న చెబుతున్న మాటలు వింటుంటే తన హయాంలో జరిగిన అవినీతి గురించి తానే చెబుతున్నట్టు వుందన్నారు. 151 నుంచి 11 స్థానాలకు దిగజారిన టిడిపి వైసిపి నాయకులకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సాగునీటి కాలువలలో పూడికలు తీయించక పోయి ఉంటే ఇటీవల పడ్డ భారీ వర్షాలకు తమ పంట పొలాలు నీట మునిగేవి అన్న వైసిపి సర్పంచులు విడవలూరు మండల సమావేశంలో అన్న మాటలను గుర్తు చేశారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక కోవూరు నియోజకవర్గంలో ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. రెండు సార్లు జాబ్ మేళా నిర్వహించి దాదాపు 3 వేల మందికి ఉపాధి కల్పిస్తూ ప్రజాసేవకు మారుపేరుగా వున్న ప్రశాంతి రెడ్డి పాలనలో కోవూరు ప్రశాంతంగా ఉందన్నారు వంశీ కృష్ణా రెడ్డి 2019 లో ఈవీఎం ట్యాపరింగ్ కారణంగా ప్రసన్నకు నలభై వేల మెజారిటీ వచ్చిందన్నారు. కేవలం 60 రోజులలో 1 లక్ష మంది టిడిపి సభ్యత్వాలు తీసుకున్నారంటే ప్రసన్న చరిత్ర ముగిసినట్టేనన్నారు. ప్రసన్న సంస్కార రహితంగా మాట్లాడుతున్నారని వంశీ కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. నిజాలు తెలుసుకొని మాట్లాడాలని మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్లకు సూచించారు టిడిపి సీనియర్ నాయకులు కరకట్ట మల్లికార్జున గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి కూడా భయపడే పరిస్థితిని ఆయన గుర్తు చేశారు. మూడేళ్ళ క్రితం ఎంపిటిసి ఎన్నికలలో ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అరాచకాలు ప్రజలు మరిచిపోలేదన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే ప్రజలు చెప్పులతో తరిమి తరిమి కొడతారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని అధికారులను దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. మండాలనికో షాడోను పెట్టి అక్రమాలకు పాల్పడ్డ ప్రసన్నకు మాట్లాడే అర్హత లేదన్నారు టిడిపి నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అవినీతి పరులను కొమ్ముకాసే ప్రసన్న తీరు మార్చుకోవాలని సూచించారు. కోవూరు టిడిపి అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ 16 నెలలు జైల్లో గడిపిన దొంగ నాయకత్వంలోని నాయకులందురు దొంగలేనన్నారు. మాజీ మంత్రి కాకాణిని ఉద్దేశించి కోర్టులో ఫైళ్ల దొంగన్నారు. వైసిపి పాలనలో గ్రావెల్ దొంగలు, గంజాయి దొంగలు ఏకంగా అసాంఘిక శక్తులు రాజ్యమేలాయన్నారు. నిజాయతి పరులైన అధికారులు, నాయకుల పై నోరు పారేసుకుంటే భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కారుకూతలు కూస్తే ప్రజలు చెప్పులతో కొడతారన్నారు. చివరిగా టిడిపి నాయకులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గాన్ని అవినీతిరహిత, క్యాన్సర్ రహితంగా మారుస్తూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రజాహిత కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రసన్న కుమార్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, మందపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మంగమూరు శ్రీహరి రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, మోర్ల సుప్రజ, ఎంవి శేషయ్య, బత్తుల హరిప్రసాద్, బండి కిరణ్ కుమార్, తువార ప్రవీణ్ కుమార్, కార్యకర్తలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన డిఎస్‌పి సింధూ ప్రియ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 24,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ను కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో శుక్రవారం నెల్లూరు టౌన్ డి.ఎస్.పి. సింధూ ప్రియ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

## బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారికి జరిమానా విధించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 24, ప్రభాతవార్త:** బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తూ వీధులను గార్బేజ్ పాయింట్లుగా మారుస్తున్న స్థాని కులను గుర్తించి వారికి జరిమానా లు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పారిశు ధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా స్థానిక 4 వ డివిజన్ లో కమిషనర్ శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న నీటి స్థాయిని పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను జంగల్ క్లియరెన్స్ చేయించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాళీ స్థలాల పన్నులను యజమానులకు అందించాలని, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక డివిజన్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును, ప్రాథమిక పాఠశాలను కమిషనర్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. వీధికుక్కలకు సంబంధించిన సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వెటర్నరీ వైద్యుణ్ణి కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలోని చెత్తకుండీలు పాతవాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించిన అడ్వర్టైజ్మెంట్ బోర్డులు, సూచికలు, ఇతర సైన్ బోర్డులను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్డు పక్కన వదిలేసిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులతో సంప్రదించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని, నగరపాలక సంస్థ కు చెందిన పార్కు స్థలము లను గుర్తించి ప్రజలకు వినియోగంలోకి తీసుకొని రావాలని కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### ఆదాని పోర్ట్ సిఈఓ జగదీష్ పటేల్




**ముత్తుకూరు, జనవరి 24, ప్రభాతవార్త** రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఈఓ జగదీష్ పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం వెనుక ఉన్న ఆవరణంలో నేస్తం ఫౌండేషన్, ఆర్ వైఎస్ టీం ఆధ్వర్యంలో అవినాష్ చంద్రయ్ శివ జ్ఞాపకార్థం ఈ మెగా రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరానికి ముఖ్య అతిధులుగా అధాని కృష్ణపట్నం సిఈఓతో పాటు అధాని పోర్టు ప్రతినిధులు వేణుగోపాల్, స్థానిక నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవికుమార్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా సిఈఓ జగదీష్ పటేల్ మాట్లాడుతూ గతంలో నవయుగ పోర్టులో అవినాష్ చంద్రయ్ సిఈఓగా పనిచేసారని, ఆయన నాకు గురువులాంటి వారన్నారు. యువకులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వడం ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం చాలా అభినందనీయమన్నారు. అలాగే క్రీడాకారులు కూడా ప్రోత్సాహాలు అందించారు. యువకులు క్రీడల్లో కూడా బాగా రాణించాలని అధాని పోర్టు తరపున తాము సహాయక సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్ కుమార్, కోరెం వెంకటేశ్వర్లు, కోడూరు రవి, యల్లంగారి ఎల్లయ్య, వల్లికల సుధాకర్, విజయ, కల్యాణ్, మోహన్ రావు, ఉదయ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# అనధికార లేఅవుట్లపై మరోసారి కొరడా ఝుళిపించిన ఎంపిడీఓ శ్రీదేవి



**కావలిరూరల్, జనవరి24 ప్రభాతవార్త** నుడా, పంచాయితీల అనుమతులులేని అనధికార లేఅవుట్లపై కావలి ఎంపిడీఓ సిహెచ్ శ్రీదేవి మరోసారి కొరడా ఝుళిపించి అక్రమ లేఅవుట్‌దారులను హెచ్చరించారు. కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె పంచాయితీపరిధిలోని జాతీయరహదారి పక్కన 1406, 1407, 1409 సర్వేనెంబర్లకు సంబంధించి ఏడుఎకరాల భూమిలో ఎటువంటి అనుమతులులేని లేఅవుట్‌లో హద్దురాళ్లను, ఫెన్సింగ్‌ను ఎంపిడీఓ శ్రీదేవి రెవిన్యూ, పంచాయితీ అధికారుల సమక్షంలో జెసిబి సహాయంతో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ లేఅవుట్‌లోని భూమి 18 మంది రైతులద్వారా కొనుగోలుచేసి లేఅవుటు వేయడం జరిగిందని తెలియచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రైతులవద్ద పొలాలుకొని నుడా, పంచాయితీ, ఎటువంటి అనుమతులులేకుండా అక్రమంగా లేఅవుట్లువేసి విక్రయిస్తున్నారని తెలియచేశారు. అనధికారికంగా ఉన్న లేఅవుట్లపై నుడాఅధికారులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని ఉన్నతాధికారుల అనుమతులతో ఈ లేఅవుట్ చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను, హద్దురాళ్లను తొలగించడం జరిగిందని తెలియచేశారు. ఎవరూకూడా అనధికార, అక్రమమైన లేఅవుట్లను ప్రోత్సహించరాదని తెలియచేశారు. ఈ లేఅవుట్‌నందు 1.50సెంట్లు గుడికి సంబంధించిన భూమి ఉందని తమ దృష్టికి రావడం జరిగిందని, ఆ భూమికూడా ఈ లేఅవుట్‌లో కలిసి ఉందని అనుమానిస్తున్నామని తెలియచేశారు. ఆ భూమిని కూడా త్వరలో వెలికితీసి స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలియచేశారు. లేఅవుట్ వేసేటపుడు పంచాయితి అధికారులను తప్పనిసరిగా సంప్రదించాలని తెలియచేశారు. లేఅవుట్ అప్రూవల్ అయినట్లయితే పంచాయితీకి 10శాతం భూమిని ఇవ్వాలని ఓపెన్‌సైట్‌కు 14శాతం చలానాను తీసుకోవాలని తెలియచేశారు. పంచాయితి అప్రూవల్ తీసుకోకపోవడం వలన ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడమేనన్నారు. రైతులవద్ద పొలాలుకొని నేరుగా ప్లాట్లను కొనుగోలుదారులకు రైతులద్వారానే రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని తెలియచేశారు. దీనివలన రిజిస్ట్రేషన్ ఫీజులుకూడా రాకుండా ప్రభుత్వానికి ఈ విధంగా కూడా నష్టం కలుగుచేస్తున్నారన్నారు. కావలి రూరల్ మండల పరిధిలో ఇంకా అక్రమ లేఅవుట్లువేసి విక్రయిస్తున్నారని సంబంధిత యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని లేనిపక్షంలో వాటినికూడా తొలగించడం జరుగుతుందని తెలియచేశారు. త్వరలో మండల పరిధిలో ఉన్న అనధికార లేఅవుట్లను పరిశీలించి తొలగించడం జరుగుతుందని తెలియచేశారు. ఆమెవెంట ఇన్‌చార్జి ఈఓపిఆర్‌డి అబ్దుల్ సమద్, విఆర్‌ఓ శ్రీనివాసులు, సర్వేయర్ సంజుసుల్తానా, పంచాయితి కార్యదర్శి వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

# కావలిట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మపేరు నామకరణం : నేతలకు పాలాభిషేకం చేసిన అభిమానులు



**కావలి, జనవరి24 ప్రభాతవార్త** కావలి పట్టణ ట్రంకురోడ్డుకు కావలి మాజీ శాసనసభ్యురాలు, దివంగతనేత మాగుంట పార్వతమ్మపేరు నామకరణం చేయడంతో శుక్రవారం రాత్రి నేతలకు పాలాభిషేకం జరిగింది. కావలి ట్రంకురోడ్డులోని "ఐ లవ్ కావలి" ఐకాన్ సెంటర్‌లో ఏఎంసి మాజీ డైరక్టర్, టిడిపినేత, ప్రముఖ వ్యాపారి తిరివీధి ప్రసాద్ నాయకత్వంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిరివీధి ప్రసాద్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలోనే కావలి ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకునేలా అభివృద్ధిని చేసిచూపిస్తున్న ఘనత కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డికే దక్కుతుందన్నారు. కావలి కనకపట్నం కావాలంటే ఎమ్మెల్యే కృష్ణన్నకే సాధ్యమవుతుదన్నారు. ఈ నెల 23వ తేదీన కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మపేరును నామకరణం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జీ.ఓ విడుదల చేశారన్నారు. పార్వతమ్మ పేరును పెట్టాలని ఎమ్మెల్యే దగుమాటి కోరికమేరకు ప్రభుత్వం స్పందించి ఈ జీ.ఓను విడుదల చేసిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. ప్రాసప్రవీణ అన్నదాత మణి తనదైనశైలిలో మాట్లాడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మాగుంట డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పోట్లూరు శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, ఏరియా వైద్యశాల డైరక్టర్ చవల రామకృష్ణ, బృందావనం హౌసింగ్ కాలని వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరాంమాల్యాద్రి, కుదవ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రమేష్, దేవకుమార్‌మాదిగ్, బొంత శ్రీనివాసయాదవ్, ఆలా శ్రీనివాసులు, దేవరకొండ శ్రీనివాసులు, అల్‌హర్, పోతుగంటి అలేఖ్య, జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బ సాయివిఠల్, రషీద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, అశ్విని, ఇబ్రహీం, పెంచలయ్య, ఆర్యవైశ్యసంఘం నేతలు, మాగుంట పార్వతమ్మ అభిమానులు, కూటమి నాయకులు భారీగా తరలివచ్చి నేతలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు.

# తక్కువ ఫీజు.. ఖరీదైన పరీక్షలు : ఫ్యామిలీ కార్డును వినియోగించుకోండి

### ఫ్యామిలీ కార్డును వినియోగించుకోండి




**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** మెడికవర్ హాస్పిటల్‌లో తక్కువ ఫీజుతోనే ఖరీదైన పరీక్షలు, వైద్య సేవలు అందించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన మెడికవర్ ఫ్యామిలీ కార్డు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి తెలియజేశారు. గురువారం ధీరజ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబ సభ్యులంతా ఓపీ కన్సల్టేషన్ పై 25శాతం, ఓపీ పరీక్షలపై 15శాతం రాయితీ పొందవచ్చన్నారు. అలాగే అడ్మిషన్ పై 10 శాతం, వైద్యేతర సేవలపై 50 శాతం, 10 కిలోమీటర్ల లోపు ఉచిత అంబులెన్స్ సదుపాయం, హోమ్ హెల్త్ కేర్ సేవలపై 30 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మందులపై 20 శాతం, హెల్త్ చెకప్స్‌పై 10శాతం, సూపర్ స్పెషాలిటీ వైద్యులతో మరో రెండు సార్లు ఉచితంగా ఓపీ కన్సల్టేషన్ లభిస్తుందన్నారు.ఈ ఫ్యామిలీ కార్డును దేశంలోని అన్ని మెడికవర్ హాస్పిటల్స్‌లలో వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు. అతి తక్కువ ఓపీ ఫీజుల ద్వారా సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందాలన్న ఉద్దేశంతోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన వివరించారు. తగ్గించిన ఓపీ ఫీజులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మెడికవర్ హాస్పిటల్‌లో పేపర్ లెస్ విధానాన్ని ప్రవేశపెట్టామని, పేపర్ లెస్ విధానంలో భాగంగా ఇకపై ఓపీ, వైద్య పరీక్షలు రిపోర్టులు, అడ్మిషన్ వివరాలు అన్ని ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతాయన్నారు. మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అన్ని రకాల క్యాన్సర్లకు అధునాతన వైద్య సేవలు అందుబాటు లో ఉన్నాయని, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. క్యాన్సర్ నివారణే లక్ష్యంగా పని చేస్తున్న మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ లో గర్భాశయ ముఖ ద్వారపు క్యాన్సర్(సర్వైకల్ క్యాన్సర్') స్కీనింగ్ పరీక్షలు పూర్తి ఉచితంగా చేస్తున్నామని ఈ అవకాశాన్ని కూడా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



**సైదాపురం, జనవరి 24, ప్రభాతవార్త :** గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి వారిని నూరుశాతం అక్షరా స్యులుగా తీర్చిదిద్దాలని నెల్లూ రు జడ్పీ సీఈఓ విద్యారమ తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పురుషొత్తం శివకుమార్ ఆధ్వర్యంలో ఉల్లాస్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ పథకంతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. సైదాపురం మండలంలో 773 మంది నిరక్షరాస్యులను గుర్తించి 49 అక్షర కేంద్రాల ద్వారా వాలంటరి ఉపాధ్యాయులతో ఈనెల 20వ తేదీ నుంచి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. మార్చి 2025 నాటికి వీరందరిని అక్షరాస్యులుగా తీర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎం.చంద్రశేఖర్, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త- వైద్యం :** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, నారాయణ నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతియ బాలికా దినోత్సవం జిరగింది. ఈ ర్యాలీ కేవీఆర్ పెట్రోల్ బంక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ నర్సింగ్ కళాశాల, నారాయణ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల హక్కులు, వారి అభివృద్ధి, సమాన అవకాశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం రేకెత్తించారు. విద్యార్థులు ఉత్సాహం, క్రమశిక్షణ, సేవా స్ఫూర్తి ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ర్యాలీలో జిల్లా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని బాలికా దినోత్సవ సందేశాన్ని విజయవంతం చేశారు.

## వాడవాడలా ఘనంగా రామకృష్ణారెడ్డి వర్ధంతి



**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయం, ముత్తుకూరు బస్టాండ్, వీఆర్సీ సెంటర్ వద్ద బీజేపీ ఆటో యూనియన్ నవాబుపేటలో మందా రవి ఆధ్వర్యంలో బీజేపీ రామకృష్ణారెడ్డి 28వ వర్ధంతిని శుక్రవారం బీజేపీ నేతలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పుట్టేటి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ సీహెచ్ రామకృష్ణారెడ్డి ఆశయాలను సాధించడమే మా లక్ష్యమన్నారు. సింహపురి ప్రజల కోసం సైనికుడిలా పనిచేసిన రామకృష్ణారెడ్డి దైవసమానమైన వ్యక్తి అని కొనియాడారు. మహనీయుడిగా ప్రజల కోసం మార్గదర్శకుడిగా నిలిచిన రామకృష్ణారెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ వారి ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడమే నిజమైన నివాళి అని ఆయనను కొనియాడారు. రామకృష్ణారెడ్డి జీవితం, సేవలు, ప్రజల పట్ల ఆయన చూపిన ఆత్మీయత అందరికి స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం పలు చోట్ల వస్త్రదానం చేశారు .ఈ కార్యక్రమంలో బీజేపీ ఆటో యూనియన్ అధ్యక్షులు బాలకృష్ణ, ముసునూరు సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర సెల్స్ ఇన్‌ఛార్జీ పి.సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహానాయుడు, పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు, యారబోలు రాజేష్, గడ్డం వినయ్ కుమార్, యశ్వంత్ సింగ్, జిల్లా కార్యదర్శిలు, దాసరి ప్రసాద్, చిలకా ప్రవీణ్, నెల్లూరు రూరల్ కన్వీనర్ ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జీ ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఉప ప్రసన్న కిరణ్, మహిళా మోర్చా నాయకులు కరణం సుభాషిణి, ప్రవీణారెడ్డి, గంటా విజయ శ్రీ , ఎస్టీ మోర్చా అధ్యక్షులు ప్రసాద్, మండల అధ్యక్షులు సుధీర్, పద్మ, మదన్, హర్ష శ్రీనివాసులురెడ్డి, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్స్ ముని సురేషన, పిడుగు లోకేష్, సునీల్‌రెడ్డి, మారం కృష్ణ, తిరకల శివ, గణేష్, కృష్ణమ్మ, నారాయణ,సత్యనారాయణ, రాధాకృష్ణారెడ్డి, తిరువీధి నారాయణ, అవినాష్ నాయుడు, మస్తాన్ గౌడ్, జిల్లా మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడకలూరులో పశువైద్యశిబిరం



**దగదర్తి, జనవరి 24 ప్రభాతవార్త :** దగదర్తి మండలంలోని తడకలూరు గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమె ంట రీ రైతు ప్రధాన కార్యదర్శి తడకలూరు మాజీ సర్పంచ్ జలదంకి శ్రీహరినాయుడు ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ సిబ్బందితో కలిసి పశువులకు, మేకలకు సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి నాయుడు మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన వెంటనే రైతులకు వ్యవసాయ అనుబంధంగా ఉన్న పశువులు, మేకల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించేందుకు గోశాలలు, ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## బాలికావిద్యను ప్రోత్సహించాలి



**జలదంకి, జనవరి24, ప్రభాతవార్త:** సమాజంలో బాలికావిద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన వుందని లోక్‌సత్త మాలకొండారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్ జాతియ బాలికాదినోత్సవాన్ని పురస్కరిం చుకొని మండల పరిధిలోని జమ్మలపాళెం ఎస్సీ ప్రా ద మిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్య క్ర మం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిదిగ ఆయన హాజరై ఆడబిడ్డలను చదివిద్దాం,రక్షిద్దాం అంటు కేంద్రప్రభుత్వం బేటి బచావో,బేటి పడావో కార్యక్రమాన్ని చేపట్టి బాలికావిద్యపైన చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు.ముఖ్యంగ చిన్నారులకు హెల్ప్ లైన్1098,ఆడవాళ్ళకు 181 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకొని రక్షణ పొందాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యా శాఖ,ఐసిడిఎస్ ప్రాజెక్టు,తదితర శాఖలు బాల్యవివాహాలను అరిక ట్టేం దుకు కృషచేయాలని అన్నారు. అలాగేబాలకార్మిక వ్యవస్థను నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టా లని కోరారు. బాలికావిద్యను ప్రోత్స హించి వారు ఉన్నతవిద్య అభ్యసించే విధంగ సమాజాన్ని చైతన్యపరచే విదంగ పాటుపడాలనలి కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, సిఆర్‌పి రవిచం ద్ర తదితరులు పాల్గొన్నారు.

## లస్కర్లను శాశ్వత ఉద్యోగులుగా నియమించండి



**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం :** బ్రిటీష్ హయాం నాటి నుండి నేటి వరకు కూడా పని చేస్తున్న వెయ్యి మంది లస్కర్లను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని భారతీయ జనతా పార్టీ నమామిగంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలుగు గంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డికి రమేష్ విజ్ఞప్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు డ్యామ్ ముంపు నిర్వాసితుల ఆర్అండ్ఆర్ యాక్ట్ జీవో నెంబరు 98, జీవో నెంబరు 68లను అధికారులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ విధానం తెచ్చి అధికారులు ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. జీవోన ఎంబరు 98 ప్రకారం ప్రాజెక్టులో వేకెన్సీలలో 50 శాతం ముంపు వాసులకు కేటాయించాలని ఉంది. దానికి అనుబంధంగా జీవో నెంబరు 68 ద్వారా ప్రభుత్వం తీసుకువచ్చి ఇరిగేషన్ సర్కిల్‌లో ముంపు వాసులకు త్వరితగతిన ఉద్యోగ వసతి కల్పించమని పేర్కొన్నారు. మొదటి సీనియార్టీ జాబితా 2019 సంవత్సరంలో, రెండో సీనియార్టి జాబితా 2014 లో రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ చేసి వీరికి ఉద్యోగాలు కేటాయించమని చెప్పింది అయితే అధికారులు అవగాహన లోపం వలన వేకెన్సీ లలో 50 శాతం ముంపు వాసులకు కేటాయించమని ఉంటే దానిని రాష్ట్ర భ్రుత్వం ఆమోదించిన సీనియార్టీ జాబితాలో50 శాతం ఉద్యోగాలని అధికారులు అవగాహన లోపంతో జీవోలను ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డాడు. కండలేరు నిర్వాసితులకు ఉద్యోగ వసతి కల్పించాలని, లేదా ప్రతి అవార్డుదారుడికి ఆర్అండ్ఆర్ యాక్ట్ ప్రకారం ఉపాధి కల్పించలేనప్పుడు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, ఏపీ సుబ్బయ్య, నీలిశెట్టి లక్ష్మణరావు, ముని సురేష్, ముంపు నిర్వాసితులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి;సురక్షతంగా ప్రయాణించండి



**కలిగిరి, జనవరి24, ప్రభాతవార్త;** ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలని కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. శుక్రవారం కలిగిరిలో పోలీసులు అవగాహనా ర్యాలీ చేపట్టారు. హెల్మెట్లు ధరించిన పోలీసులు తహసీల్దార్ కార్యాలయం సెంటరు నుండి కలిగిరిమ్మ గుడివరకు యువతతో కలిసి పోలీసులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉమాశంకర్ మాట్లాడుతూ 59వ రోడ్డు బద్రతా వారోత్సవాల్లో బాగంగా యువతతో కలసి ర్యాలీ చేపట్టామన్నారు. ప్రజలకు హెల్మెట్ యొక్క ముక్క ఉదేశ్యం గురించి వివిరించామన్నారు. ఏదైనా ప్రమాదం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ తమ ప్రాణాలను కాపాడు తుందన్నారు. అదేవిధంగా ప్రతిఒక్క వాహన దారుడు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ట్రాఫిక్‌రూల్స్‌ను పాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని,సౌండ్ హారన్లు మోగించరాదని వాహనాలు నడిపేటప్పుడు అతివేగం పనికిరాదన్నారు.వాహన దారులు సురక్షతంగా ప్రయాణించేందుకు హెల్మెట్‌ను ప్రతిఒక్కరూ దరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పురపౌరులు, యువత పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో కోవూరు ఐసీడీఎస్ ఆధ్వర యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మానవహారం చేపట్టారు. ఈ సంద ర్భంగా సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ముఖ్యంగా తమ హక్కులను బాధ్యతలను గుర్తించి సమాజ ంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఈ సంద ర్భంగా ఆమె ఆకాంక్షించారు. ముఖ్యంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. అనంతరం బాలికలకు సంబంధించిన చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో రాధిక బాలికల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్న, ప్రమీల, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మ, సైన్స్ ఉపాధ్యాయులు కె. భారతి, డి. శైలజ, ఈ. రాజేశ్వరి, ఉన్నారు., తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం బాలికల హైస్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శకుంతలా నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు. పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహిత భారతదేశంగా దేశాన్ని తీర్చిదిద్దాలని వారు నినదించారు. ప్రతి ఆడపిల్ల చదవాలని, తల్లిదండ్రులు ఆ బాలికను చదివించాలని అన్నారు. నేటి బాలికే రేపటి నాయకి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని అన్నారు. బాలికలలో మానసిక ధైర్యాన్ని పెంపొందించాలని అన్నారు. ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కునేలా వారిలో మానసిక ధైర్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఎన్ఎం సిహెచ్ శివలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు సిందూర, పి.సుమలత, బి.వాసవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో హెల్మెట్ వినియోగంపై అవగాహన



**ఉదయగిరి, జనవరి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో హెల్మెట్ వినియోగంపై శుక్రవారం కావలి ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు తమ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐ ఎన్. వెంకటరావు ఎస్సై ఇంద్రసేనారెడ్డి హెల్మెట్ దరించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ అందరి బాధ్యత కావాలి



**ఆత్మకూరు, జనవరి24, ప్రభాతవార్త:** ప్రమాదాల నివారణ అందరి బాధ్యత కావాలని ఆత్మకూరు మో టార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి సిఐ గంగాధర్, ఆర్టీసి డిపో మేనేజర్ కరిముస్నీసాలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండవాలని, ప్రయాణీకుల ప్రాణాలు తమ చేతుల్లో ఉన్నాయని డ్రైవర్లకు సూచించారు. వాహనాలు నడిపే సమయంలో అశ్రద్ధగా ఉండకూడదన్నారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని వివిధ పాఠశాలల వాహన డ్రైవర్లు, స్కూల్ యజమానులు, ఆర్టీసి డ్రైవర్లు హాజరయ్యారు.

## రైతులు శిబిరాలను ఉపయోగించుకోవాలి



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** పాడి పశువులు, మేకలు, గొర్రెలు ఇతర మూగ జీవాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పశు ఆరోగ్య శిబిరాలను సంబంధిత గ్రామాల్లో ఉన్న రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని పశు వైద్యులు డాక్టర్ షబానా తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ సూడి నిర్ధారణ పరీక్షకు 4 పశువులు వచ్చాయని, అదేవిధంగా గర్భకోశ వ్యాధికి సంబంధించి 6 పశువులు వచ్చాయని, దూడల నట్టల నివారణ మందులను 20 దూడలకు, 37 పశువులకు ఈ నివారణ మందును తాగించడం జరిగిందన్నారు.ఇ టువంటి శిబిరాలను వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## ఆడపిల్ల దేశానికి గర్వకారణం



**ఆత్మకూరు, జనవరి24,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని ఎపిఆర్‌జిఎస్ లో ప్రిన్స్‌పాల్ కామేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు వైద్యమరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదరవలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల దేశా నికి గర్వకారణమని మనదేశంలో బాలికల సమగ్ర అభివృద్ధికి గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కేంద్రం ఓకార్యక్రమాన్ని తెచ్చిందని, బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వాటిలో భాగంగానే ప్రతి ఏటా జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పిస్తుందని తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. అక్షరాస్యత కూడా పురుషుల్లో 83శాతం ఉండగా మహిళల్లో 70శాతంమాత్రమే ఉందని, మూఢనమ్మకాల వలన, వరకట్నం , సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యల వలన ఆడపిల్లల్ని కనడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించడానికి లింగవివక్షను రూపుమాపడానికి , మహిళా సాధికారిత కోసం పోరాటం అనేవి బాలికల దినోత్సవం లక్ష్యాలుగా ఉన్నాయని, మరో వూపు బాలికలపై నానాటికి లైంగికంగా వేధింపులు పెరుగుతున్నాయని బాలికా సాధికారత వస్తేనే మహిళా సాధికారత వస్తుందని అందుకు విద్యే ఏకైక మార్గమని బాల్యవివాహాలను నియంత్రణ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అస్మ, జిల్లా టిబి కంట్రోలర్ శ్రావణ్, ఎంపిహెచ్ఇఒ ఎస్.సుధాకర్, ఉపాధ్యాయులు, ఎస్‌టిఎస్, ఎస్‌టిఎల్ఎస్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వి ఎస్ యూ లో ఘనంగా 17 వ జాతీయ బాలికా దినోత్సవం



**వెంకటాచలం, జనవరి24,ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉమెన్ సెల్ , ఎన్ఎస్ఎ స్ సమన్వయంతో, ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నెల్లూరు వారు కలిసి 17వ జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కర రావు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఆడవారు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు పెంపొందించడంలో అందరూ సహకరించి, సమాజంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలి.డాక్టర్ పసుపులేటి వసుమతి ఎం.బి.బి.ఎస్., డి.ఎన్.బి గారు, విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థులకు పిసిఒడీ పై అవగాహన కల్పించారు. న్యూట్రిషనల్ డిఫిషియెన్సీ (పోషకాహార లోపం) మరియు సర్వైకల్ క్యాన్సర్ పై వివరణాత్మకంగా మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, పిసిఒడీ పై ఉన్న అపోహలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ యం. హనుమారెడ్డి గారు అధ్యక్షత వహించగా, డాక్టర్ ఆర్. మధుమతి కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు. డాక్టర్ కె. సునీత, డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, మరియు డాక్టర్ ఎస్. వేణుగోపాల్ గార్లు వక్తలుగా పాల్గొని, బాలికల ఆరోగ్యం మరియు విద్య గురించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు.కార్యక్రమాన్ని డాక్టర్ జి. సాయి స్రవంతి గారు వందన సమర్పణ ద్వారా ముగించారు.

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**వెంకటాచలం,జనవరి 24,ప్రభాతవార్త:** సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డివెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక పద్ధతిలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిం చారుపశు వైద్యాధికా రులు పరీక్షలు నిర్వహించి చికిత్స అంద జేసి అవస రమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు గ్రామా ల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ఆయా గ్రామాల్లోని పాడి రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి పాడి రైతులకు సర్వేపల్లి ఎమ్మెల్యే శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు అన్ని విధాలుగా అండగా ఉంటారు కూటమి ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులను కేటాయిస్తుందన్నారుకూటమి ప్రభుత్వం అంది చే సంక్షేమ పథకాలను సర్వేపల్లి ఎమ్మెల్యే శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారి సారధ్యంలో పాడి రైతుల కు అందించాల్సిన బాధ్యత పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందిదే .ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు హిమలాకర్ రెడ్డి, ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ గురువారెడ్డి, పూడిపర్తి పశువైద్యశాల వైద్యాధికారిని డాక్టర్ యూనీస్ రాణి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది కవిత, మాలతి, స్వర్ణమ్మ, పృథ్వి, ముజ్మిల్ తదితరులు పాల్గొన్నారు.

## వేగూరు సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామంలో ఉన్న సబ్ స్టేషన్‌లో గత సంవత్సరం నుంచి వడ్డిపాలెంకు సంబంధించిన ఫీడర్ పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ వినియోగదారులు ఈ కారణంగా అనేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఈ మేరకు శుక్రవారం పాత 11 కేవీ వడ్డిపాలెం ఫీడర్ బ్రేకర్‌ను తీసివేసి నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత రైతులు ట్రాన్స్‌కోఅధికారులకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ డిప్యూటీ ఈఈ కేవీ పవన్‌కుమార్, కోవూరు ఈఈ కె. రమేష్ చౌదరి, కోవూరు డిప్యూటీ ఈఈ కె. మధుసూదన్‌రెడ్డి, ఇనమడుగు ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీరు కె. రమేష్‌బాబు, ప్రొటెక్షన్ ఏఈ సుబ్రహ్మ ణ్యం ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నారు.

## మినీ గోకులాల పనులు వేగవంతం కావాలి



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు , విడవలూరు మండలాల్లో ప్రస్తుతం చేపడుతున్న మినీ గోకులాల నిర్మాణ పనులు మరింత వేగవంతమై సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా సంబంధిత పశు వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో శుక్రవారం రెండు మండలాలకు సంబంధించిన పశు వైద్యులు, పశు సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల్లో కృత్రిమ గర్భోత్పత్తిపై మరింత అవగాహన కల్పించి మేలుజాతి పశు ఉత్పత్తిపై తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పశు గ్రాస సబ్సిడీ పథకాలను సంబంధిత గ్రామాల్లో ఉన్న పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రతి పశు వైద్యులకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న పశు గణన కార్యక్రమాన్ని సకాలంలో పూర్తిచేసేలా తగు చొరవ తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ వాణి శంకర్, డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతి సాల్మన్, వీఎల్‌వో కృష్ణబాబు, జేవీవో ఆరిఫ్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సజ్జాద్ అహ్మద్, పశు సహాయకులు ఉన్నారు.

## కూలీల శాతాన్ని పెంచాలి



**ఉలవపాడు, జనవరి 24, ప్రభాతవార్త :** మ హాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల శాతాన్ని మరిం త పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ డీఓ ఎన్.విజయ అన్నారు. ఉలవపా దులోని ఉపాధి హామీ కార్యాలయంలో డ్వామా ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహిం చారు. మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న కాలువ పనులను మరింత వేగవంతం చేయడమే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి పనులు సాగాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో డ్వామా ఏపీవో వై.వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## నూరుశాతం అక్షరాస్యత సాధించాలి



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశం మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పొదుపు అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీఎం సుబ్బరాజు మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సమాజంలో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తయారు చేయడం వీరితో పాటు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వంట మనుషులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు, అంగన్‌వాడీ హెల్పర్లను గుర్తించి వారందరిలో అక్షర్యాస్యత శాతం పెంపొందించేలా పొదుపు అధ్యక్షులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రధానంగా మండలంలోని ప్రతిపొదుపు మహిళఅక్షరాస్యులు కావాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని పూరిస్థాయిలో విజయవంతం చేసి నూరుశాతం అక్షరాస్యత సాధించాలన్నదే ఒక లక్ష్యంగా పొదుపు గ్రూపులు ముందుకు సాగాలన్నారు. వెలుగు సీసీలు రాము, శోభా, చైతన్యబాబు, తదితరులు ఉన్నారు.

## అట్టహాసంగా డాక్టర్ "కిషోర్‌సరత్నం" క్రీడా వార్షికోత్సవ వేడుకలు



**నెల్లూరు, జనవరి24 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక సరస్వతి నగర్‌లోని డాక్టర్ కిషోర్‌స రత్నం విద్యార్థుల క్రీడా వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో అట్టహాసంగా నిర్వహించారు. తొలుత క్రీడా జ్యోతిని విద్యాసంస్థల జీఎం రామ్మూర్తి నాయుడు వెలిగించి క్రీడలను లాంఛ నంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఏటా తమ విద్యార్థులకు క్రమం తప్పకుండా క్రీడా వార్షికోత్సవ వేడుకలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఉత్తమ విద్యను అందించటంతోపాటూ క్రీడలు, సాం స్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లోతమ విద్యార్థులను ప్రోత్స హిస్తున్నామన్నారు. సరస్వతి నగర్‌లోని విద్యార్థులకుఅన్నీ క్రీడాంశాల్లో ఉత్తమ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం క్రీడలను నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఏఓలు తుహీనా, సునీల్, వాణి, ఖాశీం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, అశోక్, ప్రిన్సిపాల్ మణిమాల, శివకుమార్, ప్రపూర్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**నెల్లూరు, జనవరి24 ప్రభాత వార్త-విద్య** ఫిబ్రవరి 1నుండి మూడు రోజుల పాటూ నగరంలో నిర్వహించనున్న తమ పార్టీ 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయ్యాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని స్థానిక విఆర్‌సి మైదానంలో నగరా, బారీర్యాలీ కార్యక్రమాన్ని ఆయన భారీ డ్రోలు మోగించి ప్రారంభిం చారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నగరంలో సిపిఎం మహాసభలను అట్టహాసంగా నిర్వహించనున్నామన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరా డుతు వారి పక్షాన నిలిచే తమ పార్టీకీ ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. అనేక పోరాటాలకు సింహపురి గడ్డ పురిటి గడ్డగా ఉం దని, దక్షిణ బాతర కమ్యు నిష్ట యోదుడు పుచ్చలపల్లి సుందరయ్య ఈ ప్రాం తంనుండే వచ్చారన్నారు. ప్రజలకు ప్రత్యామ్యాయ రాజకీయ పార్టీగా ఆవిర్బవిం చేందుకు మహాసభల్లో అనేక సంస్కరణలను చేపట్టనున్నామని, అలాగే జాతీ యస్థాయిలో అనేక మంది నాయకులు పాల్గొననున్నారన్నారు. అందరూ పాల్గొని ఈ మహాసభలను విజ యవంతం చేయ్యాలని కోరారు. అనంతరం విఆర్‌సి మైదానం నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎ ర్రదుస్తులు దరించి, ఎర్ర జెండాలను చేతబూని భారీ ర్యాలీని చేపట్టారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలంరమేష్, నాయకులు జి.నాగేశ్వర రావు, కత్తి శ్రీను, మస్తాన్‌బీ, అజయ్ బాబు, ఎం. మోహనరావు, శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఆర్టీసీ 1 డిపో సిబ్బంది ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ



**నెల్లూరు, జనవరి24 ప్రభాతవార్త-విద్య** రోడ్డు బధ్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్‌డే ని పురస్కరించుకని నెల్లూరు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ప్రధాన బస్టాండు నుండి విఆర్‌సి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్బంగా డిఎం మాట్లాడుతు ప్రమాదాల నివారణకు అందరూ తప్పక రోడ్డు నియమాలు పాటించాలన్నారు. అలాగే వారివారి వాహనాలకు క్రమం తప్ప కుండా సర్వీసులు చేయించుకోవాలన్నారు. ప్రజల్లో నియమాలపై అవగాహన కల్పించేందుకు నేడు తమ డిపో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించటం జరిగిందని ఆయన తెలిపారు. డ్రైవర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, భద్రతాసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ వద్ద చిరు వ్యాపారులు ధర్నా



**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త, కలెక్టరేట్** కలెక్టరేట్ వద్ద శుక్రవారం చిరు వ్యాపారులు వారి సమస్యలపై ధర్నా చేశారు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న స్థలంలో వ్యాపారస్తులకు కొన్ని సంవత్సరాల క్రితం కొట్లు కట్టి కోట్లు కట్టి వదిలి ఉన్నారు దాని, ఆవరణంలో చిరు వ్యాపారస్తులు, వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు , కానీ ఇప్పుడు ఆ కోట్లు నెల్లూరు ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ కి అప్పగించడంతో ఫ్రూట్ మర్చంట్లు అక్కడ అంగళ్ల పెట్టుకునేటట్టు కోట్లు కేటాయించడంతో చిరు వ్యాపారస్తులకు సమస్యగా మారింది తమకు వ్యాపారం చేసుకోవడానికి స్థలం కేటాయించాలని కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు. వారికి సిఐటియు నాయకులు మద్దతు పలికారు. తమ డిమాండ్లను అర్జీ రూపంలో అందించారు.

## రైతుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం



**పొదలకూరు, జనవరి 24, ప్రభాతవార్త** రైతుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో శుక్రవారం పశువైద్యశాలలోని పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్బంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మనుషులనే పట్టించుకోలేదని పశువులను ఏమి పట్టించుకుంటారని అన్నారు. మంత్రి అచ్చం నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు అన్ని గ్రామాల్లో పశువుల సాధారణ వ్యాధికి చికిత్స చేయిస్తున్నామన్నారు నీరు తగ్గగానే తాటిపర్తి లో 15 లక్షల 50 వేల రూపాయల చెరువు పనులను చేస్తామన్నారు. పెన్షన్ 4000 ఉచిత గ్యాస్ ఇవ్వడం తెలుగుదేశం పార్టీలోనే జరిగిందన్నారు ఉగాదికి మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. గత ఐదు సంవత్సరాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కూడా మూలన పడేశారని తెలిపారు భర్త చనిపోతే ఆ పెన్షన్ తర్వాత నెలలోనే భార్యకు వచ్చేటట్లు చేశామన్నారు. కండలేరు సోమశిల జలాశయాలు 146 టీఎంసీల కెపాసిటీ కలిగినవని ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ఒకే జిల్లాలో ఎన్ని టీఎంసీల ప్రాజెక్టు లేవని అన్నారు. గత ప్రభుత్వంలో పనులు మంజూరైన విషయం కూడా మనకు తెలియదన్నారు గత ప్రభుత్వంలో 30 టీఎంసీల నీరు వృధా చేశారని మూడు లక్షల ఎకరాలు రైతులు బీడు పెట్టుకున్నారని తెలిపారు. మెట్టపైర్లు వేసుకుంటే రెండవ క్రాప్ కూడా నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐదు సంవత్సరాల్లో 150 కోట్ల రూపాయలు పూడిక తీశామని బిల్లులు చేయించుకున్నారని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గం వర్గానికి నిధులు తెచ్చుకోవడంలోరాష్ట్రంలోనే ముందుంటామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రమేష్ నాయక్, మండల టిడిపి అధ్యక్షులు తలచూరు మస్తాన్ బాబు, పొదలకూరు పట్టణ అధ్యక్షులు బుద్దులూరు మల్లికార్జుననాయుడు, టిడిపి నాయకులు కండే మస్తానయ్య, పల్లవరపు కృష్ణ,భాస్కర్ రెడ్డి, జనసేన సర్వేపల్లి ఇన్చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మండల సహాయ సంచాలకులు అరుణమ్మ, తాటిపర్తి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**సైదాపురం, జనవరి 24, ప్రభాతవార్త** సైదాపురంలో ఉన్న ప్రజాపరిషత్ కార్యాలయాన్ని నెల్లూరు జడ్పీటీసీ సీఈఓ విద్యారమ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎంఎస్ఎంఈ సర్వే, పీఏసీఎస్ సర్వే, లిటరసి సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వేలపై రివ్యూ చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందించి సమస్యలు పట్లచర్చించారు. సైదాపురం మండలం అన్ని విషయాల్లో ముందంజలో ఉందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## గో రక్షణకై మహా పాదయాత్ర



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ రక్షణ కోసం గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలనికోరుతూ ఈగో రక్ష మహా పాద యాత్రను కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందని బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం సెప్టెంబర్ 27వ తేదిన కాశ్మీర్‌లో ప్రారంభం అయిన ఈ గో రక్ష మహా పాదయాత్ర 2025 మార్చి 27వ రకు 14 రాష్ట్రాలు, 4900 కిలో మీటర్లు, 180 రోజుల్లో పూర్తిచేసేల దీక్ష పటామన్నారు. భారత దేశం వ్యవసాయ ప్రధాన దేశమని, భారత దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గోవుపైనే ఆధారపడి ఉందన్నారు. వ్యవసాయంలో హరిత విప్లవం పేరుతో ఎక్కువ దిగు బడి రావాలని అధిక శాతం మంది రైతులు రసాయనిక ఎరువులు, విషతుల్య మైన పురుగుమందులు వాడడంవలన భూమిలో ఉన్న అనంతకోటి జీవ రాసు లు కనుమరుగై సూక్ష్మపోషకాలు లేక నాణ్యమైన ఆహార పంటలు పండిచలేని స్థితికి భూమి చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో మనం నివసిస్తున్న భూమిని , పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రధాన ఆయుధం గో సంతతిని రక్షించుకోవడమే అన్నారు. ప్రి సంవత్సరం భారతదేశంలో 50వేల నుంచి లక్ష వరకు గోవులు హాతమవుతున్నాయన్నారు. రాజ్యాంగంలో రూపొందించిన ఆర్టికల్ 48ఏ ప్రకారం గో హత్య చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సనాతన ధర్మరక్షణ కోస మే ఆవును పూజించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇటీవల జపాన్ దేశంలో ఆవు పేడతో లిక్విడ్ తయారు చేసి రాకెట్ లాంచింగ్ చేశారన్నారు. ప్రపంచంలో 40 దేశాలు సైతం ఆవుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ముఖ్యంగా ఆవు మూత్రంతో అనేక మొండి వ్యాధులను సైతం నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రపంచంలోని పలు దేశాలు ఆవు మూత్రం కోసం ఆరాటపడుతున్నాయన్నారు. భవిష్యత్‌తరాల కోసమేఈ పాద యాత్ర చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. తమ పాద యాత్రలో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఈ పాదయాత్రను స్వాగతించార న్నారు. పంచగవ్యాలైన ఆవు పాలు, పెరుగు, నెయ్యి గో మూత్రం ద్వారా ఎన్నో రకాల భయంకరమైన రోగాలు కూడా సులభంగా తగ్గిపోతు న్నాయన్నారు. దేశవాలీ గోవులను కాపాడాలని ముఖ్య ఉద్దేశంతో ఈ పాదయాత్రను చేయడం జరుగు తుందన్నారు. తమకు కోవూరుకు చెందిన సుభాష్ సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తు న్నారని ఈ సందర్బంగా అభినందిస్తున్నామన్నారు. అదే విధంగా సుబ్బారావు అనే వ్యక్తి ధర్మపరిరక్షణ కోసం తమ జీవితాన్నే అంకితం చేశారని అటువంటి వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. పాద యాత్రకు కోవూరు మండల బీజేపీ అధ్యక్షులు సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మొలకల శ్రీనివాసులురెడ్డిలు స్వాగతించారన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు



**నెల్లూరు, జనవరి 24,ప్రభాత వార్త,** కలెక్టరేట్ ఈనెల 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా జెసి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. 2047 విజన్ ఆంధ్ర ప్రణాళిక అమలు లక్ష్యాలకు అనుగుణంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పది స్టాళ్లు, పది శకటాలను ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు. మీడియా, వివిప గ్యాలరీ ఏర్పాట్లు, సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, టాయిలెట్లు, శానిటేషన్ ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని శాఖల విభాగాధిపతులు సమన్వయంతో పనిచేసి వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లను అధికారులు జాయింట్ కలెక్టర్ కు వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాల ప్రదర్శన, పోలీసుల గౌరవ వందనం వంటి అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ఏఎస్‌పిజి మునిరాజా, డి.ఎస్.పి చంద్రమోహన్, డిఆర్‌ఓ ఉదయభాస్కరరావు, ఆర్డీవో అనూష, డ్వామా, డిఆర్డిఏ ప్రాజెక్ట్ అధికారులు గంగాభవాని, నాగరాజకుమారి, డిఎం అండ్ హెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఈవో ప్రసన్నలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

## జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద షాపుల ఏర్పాటు తక్షణమే ఆపండి



**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త - కలెక్టరేట్** శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్‌ని కలిసి.. జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద షాపులు ఏర్పాటు వలన వచ్చే ఇబ్బందుల పై ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేసారు. జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద షాపుల ఏర్పాటులో ఉన్న సాంకేతిక, న్యాయ సమస్యలను వివరించారు. గత ప్రభుత్వంలో అక్కడ సువిశాలమైన రోడ్డును ఏర్పాటు చేసి జాఫర్ సాహెబ్ కెనాల్ పక్కన గ్రీనరీ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని చంద్రశేఖర్ రెడ్డి కలెక్టర్‌కి తెలియజేశారు. ఆ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బంది కలగడంతో పాటు ట్రాఫిక్ జాం ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అంతేకాకుండా ఆ రోడ్డు కుండా ప్రయాణించే మహిళలకు కొంత అసౌకర్యంగా మారే అవకాశం ఉందని కలెక్టర్‌కి వివరించారు. తక్షణమే ఆ ప్రాంతంలో గ్రీనరీ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి నేతాజీ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా మైనార్టీ అధ్యక్షులు సిద్దిక్, కార్పొరేటర్ కరిముల్లా, మాజీ ఏ యం సి చైర్మన్ పెర్నెటి కోటేశ్వర రెడ్డి, కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్, జిల్లా యువజన అధ్యక్షులు, 13 డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున , విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ వినియోగంతో విద్యుత్ భారం తగ్గించుకోవచ్చు



**సైదాపురం, జనవరి 24, ప్రభాతవార్త** సోలార్‌ను వినియోగించడం ద్వారా విద్యుత్ భారాన్ని తగ్గించుకోవచ్చని మండల విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో ఏపీఎం ఎం.చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై పొదుపు సభ్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన వినియోగంపై మార్గనిర్దేశాలను వివరించారు. ఈ పథకం ద్వారా కరెంటు బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా గృహ వినియోగదారులకు ఈ పథకం వర్తిస్తుందని, ఆసక్తి గల వారు తప్పనిసరిగా వినియోగించుకొని లబ్ధి చెందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోలార్ ఏజెంట్లు, పొదుపు సంఘాలు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ క్రీడాపోటీల్లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త** : కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో అనంతపూర్ జేఎన్‌టీయూ పరిధిలో జరిగిన సౌత్‌జోన్ , ఆలిండియా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో వివిధ క్రీడాంశాలలో 9 మంది విద్యార్థులు తమ సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడా రంగంలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల కోశాధికారి వై. విజయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కూడా తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలికి తీసి కేవలం సాంకేతిక శాస్త్ర భోదనే కాకుండా సాంస్కృతిక క్రీడాంశాల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ విద్యార్థి వి. సునీల్, సీఎస్ఈ ఫైనల్ విద్యార్థి వెంకటేశ్వర్లు, తృతీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థి యశ్వంత్‌రెడ్డి వాలీబాల్, రాఘవర్షిణి చెస్‌లోనూ, జితేంద్ర ఖోఖోలోనూ, జలశ్రీ వాలీబాల్‌లోనూ, సుజిత్ , అభిరామ్, సాత్విక్ పెన్‌కాక్ సిరాటల్‌లోనూ ఎంపికయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

## నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ నిర్మలానంద బాబా శనివారం చేపట్టనున్న జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదిన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌లను గుర్తించి ఎక్కువ సార్లు ఓట్లు వేసిన వారిని ఈ సందర్భంగా సన్మానించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంనుంచి కోవూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించడం జరుగుతుంద న్నారు. డిప్యూటీ తహ సీల్దార్ ఎస్‌కే నాసర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవి, సీనియర్ అసిస్టెంట్ సుధా ఉన్నారు.

## మార్కెట్ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే



**కందుకూరు, జనవరి 24, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని ఏఎంసీ కార్యాలయం నందు మార్కెట్ యార్డు అధికారులతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించారు. విత్త నాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించేందుకు ఏర్పాటు చేసి అగ్రి టెస్టింగ్‌ల్యాబ్‌ను పరిశీలించి అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలు సుకున్నారు. ఏఎంసీ సెక్రటరీ రామాంజనేయులు, అగ్రి టెస్టిం గ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి గీత, సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్‌గా వాకాటి నూతన కమిటీకి సహకరిస్తాం - మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి




**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త-వైద్యం** ఇండియన్ రెడ్ క్రాస్ నూతన చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా జనార్ధన్‌రాజులు శుక్రవారం మద్రాస్ బస్టాండ్ వద్ద గల రెడ్ క్రాస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ద్వారాస ఏవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ప్రజల మన్ననలను పొందేందుకు కృషి చేస్తామన్నారు. రెడ్ క్రాస్ గతంలో అభివృద్ధి చేసిన నాయకుల స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తామన్నారు పలువురు ఎంసీ మెంబర్లు నూతనంగా ఎన్నికైన రైల్లనే బైక్ చైర్మన్‌ను అభినందించారు.

**నూతన కమిటీకి సహకరిస్తాం:** ఇదే సందర్బంలో రెడ్ క్రాస్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కోర్టు ద్వారా తిరిగి మేనేజింగ్ కమిటీ సభ్యులైన దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, మలిరెడ్డి కోటారెడ్డి, నేతాకు సుబ్బారెడ్డిలు అక్కడకు వచ్చారు. నూతన కమిటీ చైర్మన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డికి షేక్ హ్యాండ్ ఇచ్చి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి అభినందించారు. రెడ్స్ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకార మందిస్తామన్నారు. నిబంధనలకు విరుద్దంగా కలెక్టర్ ఆనంద్ తమ ఐదు మందిని కమిటీ సభ్యులుగా తొలగించడమే కాకుండా ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతోనే తాము కోర్టు కెళ్లామని తెలిపారు. కలెక్టర్ నిర్ణయాన్ని తప్పుపట్టి కోర్టు తమకు న్యాయం చేసిందన్నారు. అందరం రెడ్ క్రాస్ అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారంలో ఎంపీ మెంబర్లు రంగయ్య నాయుడు, బయ్యా ప్రసాద్, రవికుమార్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

## గుండెపోటుతో వీర్లగుడిపాడు సర్పంచ్ మృతి



**సంగం జనవరి 24 ప్రభాతవార్త** సంగం మం డలం వీర్లగుడిపాడు గ్రామసర్పంచ్ చెంచురత్నం నాయుడు తీవ్ర గుండెపోటుతో మృతి చెందా డు.సర్పంచ్ చెంచురత్నం నాయుడు మృతితో గ్రామంలో విషాధఛాయలు అలముకున్నాయి.విషయం తెలుసుకొని దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సర్పంచ్ చెంచురత్నం కు టుంబానికి ఆయన తన ప్రగాఢసానుభూతిని తెలిపారు.చెంచురత్నం కుటుంబానికి అండగాఉంటామని అన్నారు. మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్,బాణా శ్రీనివాసులురెడ్డి పలువురు తమ ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

## నూరు శాతం ఉత్తీర్ణత కోసం కృషి : ఎబిసి డబ్ల్యూ శ్రీదేవి



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** బిసి బాలికల వసతి గృహాలలో వున్న విద్యా ర్థులు, విద్యార్థినులు పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత వచ్చేందుకు కృషిచేస్తున్న ట్లు ఆత్మకూరు డివిజన్‌బిసి వసతిగృహాలా ఎబిసిడబ్ల్యూ శ్రీదేవి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం కోనేటి మిట్టలోని బిసి బాలికల వసతిగృహాన్ని ఆమె ఆక స్మికంగా పరిశీలించారు.హాస్టల్ వాతావరణం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు గత సంవత్సరం బిసి వసతి గృహాలలో పదోతరగతి విద్యా ర్థులు 95 శాతం ఫలితాలు సాదించారని ఆమె తెలిపారు.ఈ సంవత్సరం నూరు శాతం సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా బిసి సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మీ ఆదేశాను సారం ప్రతి హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులను మూడు గ్రేడ్లుగా విభజించడం జరుగుతుందని అన్నారు.కొద్దిగా దల్‌గా ఉండే వారిపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. అలాగే వసతి గృహాంలో ఉన్న ప్రతి విద్యార్థిపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ట్యూటర్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఆమె విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో బిసి సంక్షేమాధికారిణి లక్ష్మీ,బిసి హాస్టల్ వా ర్డన్ రమణయ్య సిబ్బంది ఉన్నారు.

## అపస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు



**బుచ్చి జనవరి 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం అపస్మా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో పదోవతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు వివేకానంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగాయి. జనవరి 8 వ తేది జరిగిన పాఠశాల స్థాయి పరీక్షలలో రాసిన విద్యార్థులు ప్రతి పాఠశాల నుండి టాప్ త్రీ మెంబర్స్ ఈ పరీక్షకు ఇచ్చేశారు. ముందుగా 16 హైస్కూల్స్ నుండి 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా అపస్మా అధ్యక్షులు ,ఉపాధ్యక్షులు వెంకటాద్రి నియోజకర్గం గౌరవాధ్యక్షులురామసుబ్బారెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులుదయాకర్‌రెడ్డి ,కార్యదర్శి మల్లేశ్వరరెడ్డి పలువురు కరస్పాండెంట్స్ కృష్ణపత్రాన్ని విడుదల చేసి పరీక్షలు నిర్వహించారు.పదోవతరగతి నూతనంగా వచ్చిన పాఠ్యంశాలుపై టెక్స్ బుక్ ఆధారంగా ఆబ్జెక్టివ్ టైప్ ఈ పరీక్ష నిర్వహించారు.వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఫిబ్రవరి 4 వ తేది జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీదర్ తెలిపారు.ఈ సమయానికి జిల్లాలోని ఎనిమిది నియోజవర్గాలలో 970 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.

## 1104 యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త** : కోవూరులోని బుద్ధి పద్మావతి కళ్యాణ మండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ 1104 నూతన కమిటీ కొరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రాన్స్‌కోలో విద్యుత్ ఉద్యోగుల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి వెళ్లి వాటిని సకాలంలో పరిష్కరించేలా నూతనంగా ఏర్పాటు కానున్న కార్యవర్గం తగు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కె. అజిత్‌కుమార్ రెడ్డి , రీజనల్ కార్యదర్శిగా ఎస్. శ్రీనివాసులు , వర్కింగ్ అధ్యక్షులుగా ఎం. కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి. వివేకానందరెడ్డి, కోశాధికారిగా జె. మహేష్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటిని ఘనంగా సత్కరించారు. గూడూరు డివిజన్ డీఎస్ శివశంకర్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు. అనంతరం కోవూరు డివిజన్ నూతనంగా ఎన్నుకున్న కమిటీ కోవూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి బొకేతో అభినందించారు.

## సూర్యఘర్ పథకం వినియోగదారులకు ఎంతో ఉపయోగకరం



**కోవూరు జనవరి 24 ప్రభాతవార్త :** ఇంటి పై కప్పుపై సోలార్ పథకం పెట్టుకుంటే ప్రభుత్వ సబ్సిడీతో పాటు నెల నెల విద్యుత్ ఛార్జీలు తగ్గించుకునే అవకాశం ఉందని కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశాన్ని సోలార్ కరెంటు ద్వారా వినియోగదారులు పొందవచ్చన్నారు. ముఖ్యంగా భవిష్యత్తు తరాలకు ఇంధనం మిఇల్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారుఈ పథకం కింద ఒక కిలో వాట్ సోలార్ ప్యానెల్ పెట్టుకుంటే 30 వేలు, రెండు కిలో వాట్ పెట్టుకుంటే 60 వేలు, మూడు కిలో వాట్ ప్యానెల్ పెట్టుకుంటే 78 వేలు ప్రభుత్వం నుంచి సబ్సిడీ వస్తుందన్నారు. ఈ సోలార్ ప్యానెల్ ఒక కిలో వాట్‌కు 120 యూనిట్లు, రెండు కిలో వాట్‌లకు 240 యూనిట్లు, మూడు కిలో వాట్లకు 360 యూనిట్లు ఉత్పత్తి జరుగుతుందన్నారు. వీటి వలన ఎక్కువ మొత్తంలో వచ్చే విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఈ సోలార్ ప్యానెల్స్ కోసం బ్యాంకులు 7.5 శాతం వడ్డీతో రుణాలు కూడా అందజేస్తుందన్నారు. మూడు కిలో వాట్‌ల సోలార్ ప్లాంట్ పెట్టడానికి సుమారు 2.10 లక్షలుఖర్చు అవుతుందని అందులో విని యోగదారుడు 30వేలు పెట్టుకుంటే మిగిలిన మొత్తానికి బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం పొందవచ్చన్నారు.. ప్రభుత్వం ఇస్తున్న ఈమంచి అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు పూర్తిస్థాయిలోఉపయోగించుకోవాలన్నారు.ట్రాన్స్‌కో ఏఈగిరిధర్ ,గ్రామ దత్తత నాయకుడుటీడీపీసీనియర్ నేతతిరుమూరు అశోక్‌రెడ్డి,ఎంపీటీసీ సభ్యులు నాగరాజు,ఆదిశేషారెడ్డి,ఆదానికంపెనీకిసంబంధించినవెండర్స్,రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌చే ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు, జనవరి 24, ప్రభాతవార్త,** కలెక్టరేట్ శుక్రవారం కలెక్టర్ చేత ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్ క్యాలెండర్ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షులు పంటా అశోక్ కుమార్ రెడ్డి కార్యదర్శి ధారా రమణ య్య వీఆ ర్వోలు జగదీష్, శ్రీనివాసుల రెడ్డి, చిరంజీవి, ముని బాబు, రాజేశ్వరి, తేజ, ప విత్ర, అశోక్, అనిల్ కుమార్, ఇమ్రాన్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సుమారు కలెక్టర్ అసోసియేషన్‌తో 20 నిమిషాలు పాటు రీ సర్వేకు సంబంధించి పలు సూచనలు చేసారు. ప్రస్తుతం జరుగుతున్నటువంటి రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా విఆర్వోలకు తెలియపరచగలరని ఆదేశించినారు కావున మీరు ప్రస్తుతం జరుగుతున్నటువంటి రీసర్వే నందు పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా చేయమని కోరుకుంటున్నాము.తదుపరి వీఆర్వోలు గ్రేడ్ 2 నుంచి 1 సీనియార్టీ జాబితాను తయారు చేయమని డిఆర్‌ఓకి ఆదేశాలు ఇచ్చినారు.